సాక్షి తిరుపతి

సోమవారం ၊ 23 ၊ అక్టోబర్ ၊ 2023

I



వరల్డ్ క్లాస్‌గా తిరుపతి రైల్వేస్టేషన్

తిరుపతి రైల్వేస్టేషన్‌ను రూ.500 కోట్ల వ్యయంతో ప్రపంచస్థాయి వసతులతో తీర్చిదిద్దుతున్నారు. - IIలో



ముక్కంటి ఆలయంలో ఆయుధపూజ

శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం వేదపండితుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా ఆయుధపూజ నిర్వహించారు. - IIలో

	గరిష్ఠం	కనిష్ఠం
తిరుపతి	36	22
చిత్తూరు	34	21
తిరుమల	31	18
గూడూరు	33	23
నగరి	36	22

న్యూస్‌రీల్

గవర్నర్‌కు సాదర వీడ్కోలు



గవర్నర్‌కు వీడ్కోలు పలుకుతున్న అధికారులు

రేణిగుంట : రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు ఆదివారం రేణిగుంట విమానాశ్రయంలో అధికారులు సాదర వీడ్కోలు పలికారు. రెండు రోజుల పర్యటన ముగించుకుని తిరుగుప్రయాణమైన గవర్నర్‌కు కలెక్టర్ వెంకటరమణారెడ్డి, ఎస్పీ పరమేశ్వరరెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసులు, తహసీల్దార్ ఉదయ్‌సంతోష్, డీఎస్పీ భవ్య కిషోర్ తదితరులు వీడ్కోలు పలికారు. అనంతరం ఆయన ప్రత్యేక విమానంలో బెంగుళూరుకు బయలుదేరి వెళ్లారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 8 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శనివారం అర్ధరాత్రి వరకు 65,422 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 33,212 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.2.84 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

26న జాబ్ డ్రైవ్

తిరుపతి అర్బన్ : జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 26వ తేదీ ఉదయం 9 గంటలకు తిరుపతిలోని శ్రీజ మిల్క్ ప్రొడ్యూసర్ కంపెనీలో జాబ్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు సంస్థ జిల్లా అధికారి శ్యామ్‌మోహన్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ డిప్లొమా, ఐటీఐ, ఇంటర్, బీఎస్సీ కెమిస్ట్రీ, ఎంఎస్సీ కెమిస్ట్రీ, ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన యువతీయువకులు ఇంటర్వ్యూలకు హాజరుకావచ్చన్నారు. ఆ మేరకు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 9966601867, 9177508279 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

నేటి 'స్పందన' రద్దు

తిరుపతి అర్బన్ : ప్రజాసమస్యల పరిష్కారం కోసం సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు అధికారులు వెల్లడించారు. దసరా నేపథ్యంలో సోమ, మంగళవారం సెలవులైనందున స్పందన రద్దయ్యిందని తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో యథావిధిగా కార్యకలాపాలు కొనసాగుతాయని వివరించారు.

డిప్యూటీ కలెక్టర్ల బదిలీ

తిరుపతి అర్బన్ : కడప జీఎస్ఎస్ఎస్ డిప్యూటీ కలెక్టర్ కేపీ నరసింహులును తిరుపతి వీసీఐసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా, ఇక్కడ పనిచేస్తున్న ఎం.శ్రీనివాసులును ఎల్‌పీసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా బదిలీ చేశారు. ఆదివారం ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. త్వరలోనే వీరు ఆయా స్థానాల్లో బాధ్యతలు చేపట్టనున్నారు.

అయిగిరి నందిని..నందిత మేదిని

చౌడేపల్లె: బోయకొండ శ్రీగంగమ్మ ఆలయంలో శరన్నవ రాత్రి మహోత్సవాల్లో భాగంగా ఆదివారం మహిషాసురమర్దిని అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. వేదపండితులు గోవర్ధనశర్మ, విశ్వనాథశర్మ ఆధ్వర్యంలో గణపతి పూజ, స్వస్తివాచనం, దేవనాంది, గణపతిహోమం, చండీహోమం నిర్వహించారు. అమ్మవారి ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజరెడ్డి, ఈఓ చంద్రమౌళి పాల్గొన్నారు.

కల్కి కటాక్షం

అశేష భక్తజన సందోహం నడుమ స్వర్ణరథోత్సవం



అశ్వవాహనంపై ఊరేగుతున్న శ్రీవారు





- వైభవంగా శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు
- స్వర్ణరథంపై ఊరేగిన సర్వాంతర్యామి
- అశ్వవాహనంపై విహరించిన అనంతతేజోమూర్తి
- నేడు చక్రస్నానం.. సర్వం సిద్ధం

తనువును పులకరింపజేసే మలయమారుతాలు.. మనసుని పరవశింపజేసే గోవిందనామాలు.. ఆధ్యాత్మికానుభూతిని ఇనుమడింపజేసే జీయ్యంగార్ల గోష్టిగానాలు.. శ్రవణానందకరంగా మంగళవాయిద్యాలు.. కనులపండువగా కళాబృందాల నృత్యాభినయాలు.. ఠీవిగా ముందుకేగుతున్న గజరాజులు.. అడుగడుగునా కర్పూర హారతుల నడుమ ఉభయదేవేరీ సమేతంగా మలయప్పస్వామివారు దర్శనమిచ్చారు. స్వర్ణరథంపై దివ్యతేజోవిరాజితంగా దేవదేవుడు విహరిస్తూ భక్తులకు సకల శుభాలను అనుగ్రహించారు. కలిదోషాలను నివారించే కల్కి అవతారంలో అశ్వవాహనం అధిరోహించి సమస్త జీవకోటిని కటాక్షించారు.

తిరుమల : తిరుమల శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా సాగుతున్నాయి. ఎనిమిదోరోజు ఆదివారం ఉదయం శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీమలయప్పస్వామివారు స్వర్ణరథంపై ఊరేగారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాలు, కళాబృందాల ప్రదర్శనల నడుమ మాడవీధుల్లో విహరించారు. ఈ క్రమంలోనే రాత్రి 7 నుంచి 9 గంటల వరకు కనులపండువగా అశ్వవాహన సేవ నిర్వహించారు. శ్రీవారు కల్కి అలంకారంలో అశ్వంపై కొలువుదీరి భక్తజనులను అనుగ్రహించారు. వాహన సేవల్లో టీటీడీ బోర్డు చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈఓ ఏవీ ధర్మారెడ్డి పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న ఉత్సవాలు

శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు సోమవారం ఉదయం స్నపన తిరుమంజనం, చక్రసాన్నం, రాత్రి ధ్వజారోహణంతో పరిపూర్ణంకానున్నాయి.

చక్రస్నానానికి ఏర్పాట్లు పూర్తి

బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం 6 నుంచి 9 గంటల వరకు వరాహస్వామివారి ఆలయం వద్ద పుష్కరిణిలో ముందుగా శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామివారికి, చక్రత్తాళ్వార్‌కు స్నపనతిరుమంజనం జరిపించనున్నారు. అనంతరం శాస్త్రోక్తంగా చక్రస్నానం నిర్వహించనున్నారు. ఈ క్రమంలో భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అధికారులు సర్వం సిద్ధం చేశారు.



స్వర్ణరథోత్సవంలో టీటీడీ బోర్డు చైర్మన్ భూమన, ఈఓ ధర్మారెడ్డి



మహిషాసురమర్ధినిగా కళాకారిణి అభినయం




ఏడుకొండలవాని వైభవాన్ని చాటుతూ కళా ప్రదర్శన

పర్యావరణహితంగా దశమి వేడుకలు



మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



డిప్యూటీ సీఎం నారాయణస్వామి



మంత్రి రోజా



వెంకటరమణారెడ్డి,కలెక్టర్

తిరుపతి అర్బన్ : పర్యావరణహితంగా జిల్లా ప్రజలు విజయదశమి వేడుకలు జరుపుకోవాలని డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్కే రోజా కోరారు. ఆదివారం వారు మాట్లాడుతూ దుర్గామాత ఆశీస్సులతో ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎంపీలు గురుమూర్తి, రెడ్డెప్ప, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కలెక్టర్ వెంకటరమణారెడ్డి, జేసీ డీకే బాలాజీ తదితరులు జిల్లా వాసులకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు.

వినాయకుని సేవలో హైకోర్టు న్యాయమూర్తి



జస్టిస్ వెంకటరమణకు చిత్రపటం అందిస్తున్న ఆలయ కమిటీ చైర్మన్, ఈఓ

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకటరమణ ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందించారు.

బస్సు యాత్రతో ప్రజలకు మరింత చేరువ



మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి, పక్కన డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

"రాజ్యాధికారం అన్ని వర్గాలకు అందించాలన్న ధ్యేయంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పని చేస్తోంది.. అన్ని ప్రధాన పదవులు వెనుకబడిన వర్గాలకు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుంది. ప్రజలకు జరిగిన మేలును వివరించడమే బస్సు యాత్ర ఉద్దేశం" అని డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్పష్టం చేశారు. నవంబరు 2న చిత్తూరు నుంచి బస్సుయాత్ర ప్రారంభించనున్న నేపథ్యంలో ఆదివారం వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. సామాజిక బస్సు యాత్ర విజయవంతం చేయడపై పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు.

- జరిగిన మేలును వివరించడమే ఉద్దేశం
- ఎన్నికల హామీలను పూర్తిగా నెరవేర్చాం
- సామాజిక న్యాయం చేసింది సీఎం జగన్ మాత్రమే
- 2న చిత్తూరులో బస్సు యాత్ర
- డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రి పెద్దిరెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను పూర్తిగా నెరవేర్చామని, జరిగిన అభివృద్ధిని, సంక్షేమ లబ్ధిని క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించాలని డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కోరారు. ఆదివారం చిత్తూరు ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో నిర్వహించిన పార్టీ నేతలు, కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లాలోని 7 నియోజకవర్గాల్లో అభివృద్ధి, సంక్షేమం పరుగులు తీస్తోందని ప్రజల అభిమానంతో అన్ని చోట్ల గెలుపు తథ్యమని స్పష్టం చేశారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థల ద్వారా నవరత్న పథకాలతో ప్రజల ముంగిటకే పాలన వచ్చిందన్నారు. జిల్లాలో నవంబర్ 2వ తేదీన చిత్తూరు నియోజకవర్గం నుంచి బస్సు యాత్ర ప్రారంభమవుతుందని, అందుకు తగ్గట్టుగా పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని సూచించారు.

చరిత్రకు నాంది

దేశ చరిత్రలో బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి పెద్దపీట వేసిన ఏకైక నాయకుడు సీఎం వైఎస్ జగన్ మాత్రమేనని డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. బీసీ డిక్లరేషన్‌తో సరికొత్త చరిత్రకు నాంది పలికినట్లు పేర్కొన్నారు. అణగారిన వర్గాల బతుకుల్లో వెలుగులు నింపి రాజకీయ, సామాజిక, విద్య, ఆర్థిక పరంగా ఎన్నో అవకాశాలను ప్రభుత్వం కల్పించిందని వెల్లడించారు. ఒకప్పుడు సంక్షేమ పథకాల కోసం అధికారులు, కార్యాలయాల చుట్టూ ప్రజలు తిరగేవారని, ఇప్పుడు అర్హత ఉంటే ఇంటి వద్దకే పథకాలు అందుతున్నాయని తెలిపారు. జరిగిన మేలును ప్రజలకు చెప్పేందుకు బస్సు యాత్ర ఉపయోగపడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకొని యాత్రను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో ఎంపీ రెడ్డెప్ప, పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ భరత్, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసుల, ఎంఎస్‌బాబు, వెంకటేగౌడ, జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి, కార్పొరేషన్ చైర్మన్లు వనిత, శాంతి, కుమారరాజా, నియోజకవర్గ పరిశీలకులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

బాల్ బ్యాడ్మింటన్ రాష్ట్ర పోటీలు ప్రారంభం



బాల్‌బ్యాడ్మింటన్ కోర్టు ప్రారంభిస్తున్న మంత్రి రోజా

- 13 ఉమ్మడి జిల్లాల నుంచి విచ్చేసిన క్రీడాకారులు
- పోటీలు ప్రారంభించిన మంత్రి రోజా

నగరి: పట్టణంలోని కేవీకే మైదానంలో ఆదివారం 8వ బాల్ బ్యాడ్మింటన్ రాష్ట్ర స్థాయి పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మంత్రి ఆర్కే రోజా జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలు ప్రారంభించారు. 13 జిల్లాల నుంచి విచ్చేసిన క్రీడాకారులు పరేడ్ నిర్వహిస్తూ మంత్రికి గౌరవ వందనం చేశారు. అనంతరం పోటీలకు సిద్ధం చేసిన బాల్‌బ్యాడ్మింటన్ కోర్టులను మంత్రి ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని వారిని ఉత్సాహ పరిచారు. 'థ్యాంక్యూ మేడమ్' ప్లకార్డులతో క్రీడాకారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు విజయశంకర్ రెడ్డి, వెంకటరావ్ మాట్లాడుతూ క్రీడలకు ప్రభుత్వం ఎంతో ప్రోత్సాహాన్ని అందిస్తోందన్నారు. ఇటీవల ఆసియా క్రీడల్లో గెలుపొందిన వారికి, జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్‌లో విజేతగా నిలిచిన జట్టుకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందించిందన్నారు. ఇందుకుగాను క్రీడాశాఖ మంత్రి ఆర్కే రోజాకు కృతజ్ఞతలు తెలిపారు. బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వెంకటస్వామి, కార్యదర్శి బాలాజీ, ఉపాధ్యక్షుడు గోపి, జాయింట్ సెక్రటరీ, సుధాకర్, ట్రెజరర్ రాజేష్, అడ్వైజర్ జయరామయ్య శెట్టి, డీఎస్ఏ చీఫ్ కోచ్ బాలాజీ, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి సురేష్‌బాబు, శాప్‌కోచ్ బాబు, అసోసియేషన్ నగరి చైర్మన్ ఎంవీ రవిబాబు, అధ్యక్షుడు మోహన్, కార్యదర్శి నిజాం, పీడీలు చంద్ర, మణి, ప్రకాష్, లోకేష్, హేమాద్రి, సుబ్బు, కుమార్ పాల్గొన్నారు.



వివిధ జిల్లాల నుంచి హాజరైన క్రీడాకారులు

రమణీయం.. రథోత్సవం

- తుమ్మలగుంటలో కనులపండువగా బ్రహ్మోత్సవాలు
- రథంపై ఊరేగిన కల్యాణవెంకన్న
- వైభవంగా అశ్వవాహన సేవ
- పాల్గొన్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దంపతులు



రథంపై శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకన్న



అశ్వవాహన సేవలో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి



సారె తీసుకువస్తున్న తుమ్మలగుంట వాసులతో ఎమ్మెల్యే చెవిరెడ్డి దంపతులు

తిరుపతి రూరల్ : తుమ్మలగుంటలో శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు కనులపండువగా సాగుతున్నాయి. ఆదివారం ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకన్నకు రథోత్సవం నిర్వహించారు. రాత్రి కల్కి అవతారంలో శ్రీవారు ఆశ్వవాహనంపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. ఈ సందర్భంగా కల్యాణవెంకన్నకు ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం ఉత్సవర్లను అలంకార మండపానికి వేంచేపు చేసి రథంపై కొలువుదీర్చారు. భక్తుల గోవింద నామ స్మరణల నడుమ శ్రీవారు రథంపై విహరించారు. భక్తులు ఉప్పు, మిరియాలను రథంపై చల్లి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి దంపతులు పాల్గొన్నారు. టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

భక్తుల సేవలో తుమ్మలగుంట వాసులు

నవరాత్రి బ్రహ్మోత్సవాలకు జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. స్వామి వారి వాహన సేవలో పాల్గొంటున్న భక్తులు మాడవీధుల్లో నడుస్తూ తన్మయత్వం చెందుతున్నారు. ఈ క్రమంలో తుమ్మలగుంట వాసులు దారి పొడవునా భక్తులకు తాగునీరు, మజ్జిగ, ప్రసాదాలు, ఎనర్జీ డ్రింక్స్ అందిస్తున్నారు. అలాగే వాహన సేవల్లో స్వామి వారికి ఊరేగింపుగా సారె తీసుకువచ్చి సమర్పిస్తున్నారు.

27న బడుగుల బహిరంగ సభ



మాట్లాడుతున్న తొండమల్ల పుల్లయ్య

తిరుపతి కల్చరల్ : సామాజిక సాధికార బస్సు యాత్ర తిరుపతికి చేరుకుంటున్న నేపథ్యంలో ఈనెల 27వ తేదీన గ్రూప్ థియేటర్ సర్కిల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల చైతన్య బహిరంగ సభ నిర్వహించనున్నట్లు నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తొండమల్ల పుల్లయ్య తెలిపారు. ఆదివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. సాధికార చైతన్య బస్సు యాత్రను ఈనెల 20 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టినట్లు వెల్లడించారు. ఈ యాత్ర ఈనెల 27వ తేదీ మధ్యాహ్నం 2.45 గంటలకు అన్నమయ్య సర్కిల్‌కు చేరుకుంటుందన్నారు. అక్కడి నుంచి లక్ష్మీపురం సర్కిల్ మీదుగా గ్రూప్ థియేటర్ సర్కిల్‌కు 3.15 గంటలకు వస్తుందని వివరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు మంత్రులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు హాజరవుతారని, ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనారిటీలు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. రజక సంఘ నేత అక్కనపల్లి లక్ష్మయ్య మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో బడుగు బలహీన వర్గాలకు తీవ్ర నిరాశే మిగిలిందన్నారు. అన్ని పథకాలను కమీషన్లతో దోచుకుని దగా చేశారని ఆరోపించారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ అధికారంలోకి తీసుకురావాల్సిన బాధ్యత అందరిపై ఉందని వివరించారు. సమావేశంలో వడ్డెర సంఘ నేత రమణ, వాల్మీకి సంఘం నేత నాగరాజు, ముదిరాజ్ సంఘం నేత జీవరత్నం, లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు దొరబాబు, బీసీ నేతలు బాబు యాదవ్, ఉదయగిరి రమేష్, బీవీ.కేశవులు, లక్ష్మీ వెంకటేష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

శతక పద్యాల వ్యాప్తితో విజ్ఞాన సమాజం



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ఆచార్య కె.వెంకటరెడ్డి, తెలుగు భాషోద్యమ సమితి ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: విజ్ఞాన సమాజాన్ని ఆవిష్కరించుకోవడానికి శతక పద్యాలలోని మానవీయ విలువలను బడి పిల్లల్లో వ్యాప్తి చేయాలని ఎస్కే యూనివర్సిటీ పూర్వ వీసీ ఆచార్య కె.వెంకటరెడ్డి తెలిపారు. తెలుగు భాషోద్యమ సమితి ప్రచురించిన ప్యాకెట్ సైజ్ వ్యక్తిత్వ వికాస పద్యాలు పుస్తకాన్ని ఎస్వీనగర్‌లోని ఆచార్య స్వగృహంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన తెలుగు సాహిత్యంలోని శతకాలు, తెలుగు జాతికున్న గొప్పతనాన్ని తెలిపారు. తెలుగు భాషోద్యమ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సాకం నాగరాజు మాట్లాడుతూ వెంకటరెడ్డి కుటుంబం సౌజన్యంతో ముంద్రించిన పదివేల శతక పద్యాల పుస్తకాలను బడిపిల్లల్లో పుస్తక పఠనాన్ని ప్రోత్సహించడానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు భాషోద్యమ సమితి ప్రధాన కార్యదర్శి టెంకాయల దామోదరం, సభ్యులు డాక్టర్ తమటం రామచంద్రారెడ్డి, పేరూరు బాలసుబ్రమణ్యం, బొందు రామచంద్రారెడ్డి, వాకా ప్రసాద్, ఎం.చంద్రారెడ్డి, ముంగర శశిధర్‌రాజు, వై.రమేష్‌బాబు, విజయ, కేశవులు పాల్గొన్నారు.

బాలిక ఆత్మహత్య

చిల్లకూరు : స్థానిక మిక్సెడ్ కాలనీలో ఆదివారం ఓ బాలిక ఆత్మహత్యకు పాల్పడింది. వివరాలు.. గ్రామానికి చెందిన ఆదిశేషయ్య కుమార్తె భార్గవి(15) సమీపంలోని ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతోంది. దసరా సెలవుల నేపథ్యంలో ఇంట్లోనే ఉంటోంది. ఈ క్రమంలో ట్యూషన్‌కు వెళ్లకుండా ఆడుకుంటూ ఉండడంతో తండ్రి మందలించాడు. తర్వాత తన పనికి వెళ్లిపోయాడు. తండ్రి మందలించాడని మనస్తాపం చెందిన భార్గవి ఇంట్లోనే ఉరేసుకుంది. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. బాలిక మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వరల్డ్ క్లాస్‌గా తిరుపతి రైల్వేస్టేషన్

ప్రపంచస్థాయి వసతులతో తిరుపతి రైల్వేస్టేషన్‌ను తీర్చిదిద్దుతున్నారు. తిరుమల శ్రీవారి వైభవాన్ని చాటిచెప్పేలా ప్రత్యేక డిజైన్లతో నిర్మాణాలు చేపడుతున్నారు. ప్రయాణికుల అత్యాధునిక సౌకర్యాలు కల్పించేందుకు పకడ్బందీ చర్యలు చేపడుతున్నారు. రూ.వందల కోట్ల వ్యయంతో అధునాతన భవనాలను ఆవిష్కరించేందుకు శరవేగంగా కార్యాచరణ అమలు చేస్తున్నారు.

- ప్రత్యేక డిజైన్లతో నిర్మాణాలు
- శరవేగంగా సాగుతున్న పనులు



నూతన రైల్వే స్టేషన్ (నమూనా చిత్రం)

తిరుపతి అర్బన్ : తిరుపతి రైల్వే స్టేషన్‌కు ఇప్పటికే ఏ క్లాస్ గుర్తింపు ఉంది. సుమారు రూ.500 కోట్లతో తిరుపతి రైల్వేస్టేషన్ వరల్డ్‌క్లాస్ స్టేషన్‌గా రూపాంతరం చెందనుంది. ఇందుకోసం అద్భుతమైన డిజైన్లను రూపొందించారు. ఆ మేరకు ఆధునికీకరణ పనులకు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా ఇప్పటికే దక్షణం వైపు నూతన భవనాలు, 1 నుంచి 6వ ప్లాట్‌ఫాం వరకు ఎయిర్ కాన్‌కోర్స్ నిర్మాణం కోసం ఫౌండేషన్ కాస్టింగ్ పనులు పూర్తి చేశారు. స్టేషన్‌కు దక్షణం వైపు వాహనాల పార్కింగ్‌తోపాటు పలు భవనాలను నిర్మించారు. మరో వైపు రెండు రోజులుగా ఉత్తరం వైపు పనులు ప్రారంభించడానికి పురాతనమైన ప్రధాన ముఖ ద్వారం 1, 2 వద్ద భవనాలను కూల్చివేశారు. తాజాగా ఉత్తరం వైపుతోపాటు తూర్పు, పడమర అన్ని వైపులా పనులు చేపట్టారు. ఈ క్రమంలో ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా దేరాలతో నీడను కల్పిస్తున్నారు. ఇతర మౌలిక వసతుల కల్పనకు రైల్వే అధికారు కృషి చేస్తున్నారు. వచ్చే ఏడాదికి అన్ని నిర్మాణ పనులు పూర్తి చేసి ప్రయాణికులకు వరల్డ్ క్లాస్ రైల్వేస్టేషన్‌ను అందుబాటులోకి తీసుకురానున్నారు.

సంతోషంగా ఉంది



తిరుపతి రైల్వే స్టేషన్ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాం. రైల్వే మంత్రితోపాటు పలువురు ఉన్నతాధికారులను ఎప్పటికప్పుడు కలిసి మాట్లాడాం. ప్రధానంగా నూతన భవనాల నిర్మాణంలో భక్తిభావం ఉట్టిపడేలా డిజైన్లు రూపొందించేందుకు శ్రమించాం. తిరుపతి ఎంపీగా రైల్వేస్టేషన్, సెంట్రల్ బస్టాండ్‌ను రూ.వందల కోట్లతో అభివృద్ధి చేసే అవకాశం వచ్చినందుకు సంతోషంగా ఉంది.

– గురుమూర్తి, ఎంపీ, తిరుపతి

మెరుగైన వసతులు



రైల్వే స్టేషన్ నిర్మాణ పనుల నేపథ్యంలో ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా మెరుగైన వసతులు కల్పిస్తున్నాం. ఇందుకోసం ప్రత్యేక టీం పర్యవేక్షిస్తోంది. ఈ కీలక తరుణంలో ప్రయాణికులు సైతం సహకరించాలని కోరుతున్నాం. వరల్డ్ క్లాస్ స్టేషన్ పనులు పూర్తయితే అత్యంత ఆధునిక సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయి. తిరుపతి కీర్తి మరింత ఇనుమడిస్తుంది.

– సత్యనారాయణ, డైరెక్టర్, తిరుపతి రైల్వేస్టేషన్

ముక్కంటి ఆలయంలో ఆయుధపూజ





ఆయుధాలకు పూజ నిర్వహిస్తున్న వేదపండితులు, పూజలో ఆలయ కమిటీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి : శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం శ్రీకాళహస్తీశ్వరాలయంలో శాస్త్రోక్తంగా ఆయుధపూజ నిర్వహించారు. స్వామివారి నవగ్రహ కవచం, అమ్మవారి స్వర్ణ హస్తం, ఆయుధాలను నిత్య కల్యాణమండపంలో కొలువుదీర్చారు. అనంతరం ఆయుధాలను శుద్ధి చేసి, పసుపు, కుంకుమ, చందనం, సుగంధ పుష్పాలతో అలంకరించారు. అర్చకులు ధూప దీప నైవేద్యాలతోపాటు పంచ హారతులు సమర్పించారు.కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

తరతరాల పుణ్యమే... భక్త జన సేవ



భక్తులకు అన్నదానం చేస్తున్న టీటీడీ బోర్డు సభ్యులు

తిరుపతి కల్చరల్: దేవుడైన తిరుమల గోవిందుని భక్తులకు సేవ చేయడం అంటే తరతరాల పుణ్యమేనని టీటీడీ బోర్డు సభ్యుడు ఎస్.నాగరత్నం తెలిపారు. శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని టీటీడీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఉద్యోగుల జేఏసీ అధ్యక్షుడు కె.ఆంజనేయులు దంపతుల ఆధ్వర్యంలో ఆదివారం గరుడ సర్కిల్ వద్ద భక్తులకు భారీ స్థాయిలో అన్నదానం నిర్వహించారు. నాగరత్నంతో పాటు టీటీడీ బోర్డు సభ్యులు జీవీ సుబ్బరాజు, సి.అశ్వర్థ నాయక్ పాల్గొన్నారు. అనంతరం జేఏసీ అధ్యక్షుడు కె.ఆంజనేయులు మాట్లాడుతూ పదిహేనేళ్లుగా ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేపడుతున్నామన్నారు. టీటీడీ చైర్మన్ భూమన, డిప్యూటీ మేయర్ అభినయరెడ్డి అందించిన సలహాలు ఆదర్శమని తెలిపారు. జేఏసీ కోశాధికారి వెంకటరత్నం, సభ్యులు సుబ్రమణ్యంరెడ్డి, బాలసుబ్రమణ్యం, క్రాంతి, చెన్నూరు సుబ్రమణ్యం, శివకుమార్ పాల్గొన్నారు.

దుర్గాదేవిగా తాతయ్యగుంట గంగమ్మ



తాతయ్యగుంట గంగమ్మ



సరస్వతి అలంకరణలో ఎల్లమ్మ దేవి

తిరుపతి కల్చరల్: శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో ఏడో రోజు ఆదివారం అమ్మవారు శ్రీదుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ చైర్మన్ కట్టా గోపియాదవ్, పాలక మండలి సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీకన్యకాపరమేశ్వరి దర్శనం..

కొత్త వీధిలోని శ్రీకన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం అమ్మవారు శ్రీశక్తిపూజ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ పాలక మండలి చైర్మన్ సత్యనారాయణ, కార్యదర్శి దిండుకుర్తి నరసింహులు, కోశాధికారి శిరీష మంజునాథ్, సభ్యులు పాల్గొన్నారు.

శ్రీరాజరాజేశ్వరి దేవిగా శ్రీమూలస్థాన ఎల్లమ్మ

చంద్రగిరి: దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చంద్రగిరి గ్రామదేవత శ్రీమూలస్థాన ఎల్లమ్మ అమ్మవారు ఆదివారం సాయంత్రం శ్రీరాజరాజేశ్వరి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ యారాశి చంద్రశేఖర్‌రెడ్డి, ఈఓ తిమ్మారెడ్డి, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

డిగ్రీ ఇన్‌స్టంట్ ఫలితాలు విడుదల

తిరుపతి సిటీ: ఎస్వీయూ పరిధిలో సెప్టెంబర్ నెలలో నిర్వహించిన డిగ్రీ ఐదు, ఆరో సెమిస్టర్ ఇన్‌స్టంట్ పరీక్షా ఫలితాలు విడుదల చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ దామ్లానాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఫలితాల కోసం వర్సిటీ వెబ్‌సైట్‌ను వీక్షించాలని ఆయన పేర్కొన్నారు.

తిరుపతి అభివృద్ధిని అడ్డుకుంటున్నారు

తిరుపతి కల్చరల్: తిరుపతి నగర అభివృద్ధికి టీటీడీ ఒక శాతం నిధులు కేటాయించడాన్ని బీజేపీ నేతలు అడ్డుకోవడం విడ్డూరమని, ఆ పార్టీ తీరును ప్రజలు తిప్పికొట్టాలని బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర నేత ఆర్కాట్ కృష్ణప్రసాద్ తెలిపారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికైనా తీరు మార్చుకోవాలని హెచ్చరించారు. లేని పక్షంలో ప్రజలతో కలిసి ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ నేతలు బెల్లంకొండ సురేష్, రాఘవరెడ్డి, రామారావు, జ్ఞానేశ్వరి, గురునాథం పాల్గొన్నారు.

కాణిపాకంలో మహాచండీ యాగం



దుర్గాదేవి అలంకరణలోని అమ్మవారికి పూజలు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వెలసిన శ్రీకాళికామాత ఆలయంలో దసరా మహోత్సవాల్లో భాగంగా ఆదివారం మహాచండీ యాగం శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం తరపున చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు సారెను సమర్పించారు. కాళికామాత ఆలయ ధర్మకర్త, కాణిపాక సర్పంచ్ శాంతిసాగర్ రెడ్డి వాటిని స్వీకరించారు. వాటిని అమ్మవారికి అలంకరించి ప్రత్యేక పూజ లు నిర్వహిచారు. చైర్మన్, ఈఓకు తీర్థ ప్రసాదాలు అందించారు. అంతకు ముందు మహా చండీయాగం పూర్ణాహుతి పూజల్లో చైర్మన్, ఈఓ పాల్గొన్నారు. రాత్రి అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు.

తమిళనాడు బియ్యం సీజ్.. ఒకరి అరెస్టు

చిత్తూరు అర్బన్: తమిళనాడు నుంచి బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని చిత్తూరు పోలీసులు అరెస్టు చేశారు. టూ టౌన్ ఎస్ఐ నాగరాజు కథనం మేరకు.. చిత్తూరు రెవెన్యూ అధికారులు ఆదివారం చిత్తూరు–బెంగళూరు బైపాస్ వద్ద తనిఖీలు చేపట్టారు. బొలేరో వాహనాన్ని తనిఖీ చేయగా పెద్ద ఎత్తున బియ్యం బస్తాలు కనిపించాయి. మొత్తం 4030 కిలోల బియ్యాన్ని గుర్తించి సీజ్ చేసిన అధికారులు.. పోలీ సులకు అప్పగించారు. బొలెరోలో ఉన్న బెంగళూర్ కు చెందిన రఘు (27) అనే వ్యక్తిని అరెస్టు చేశారు. వాహనం సహా బియ్యాన్ని సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

సారా స్వాధీనం. నిందితుడి అరెస్టు

చిత్తూరు అర్బన్: చిత్తపార అటవీ ప్రాంతం నుంచి విక్రయించేందుకు సారా తీసుకొస్తున్న గోవిందస్వామి(52) అనే వ్యక్తిని చిత్తూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) అర్బన్ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. గుడిపాల మండలంలో ఎస్ ఈబీ పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. చిత్తపార అటవీ ప్రాంతం నుంచి సారా తీసుకొస్తున్న గోవిందస్వామిని పట్టుకుని, 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. పోలీసులను చూసి పారిపోయిన పొన్నుస్వామి అనే వ్యక్తిపై సైతం కేసు నమోదుచేసి గాలిస్తున్నట్లు సీఐ జోగేంద్ర తెలిపారు. అటవీ ప్రాంతంలో నిల్వ ఉంచిన 400 లీటర్ల సారా ఊటను ధ్వంసం చేసినట్లు పేర్కొన్నారు. ఈ దాడుల్లో ఎస్ఐలు రాంప్రసాద్, బాబు, సిబ్బంది శంకర్, వెంకటేశ్వర్లు, జయశంకర్ పాల్గొన్నారు.

గాయపడిన బాలిక మృతి

పెనుమూరు(కార్వేటినగరం): కలిగిరికొండ రెండో మలుపు వద్ద శనివారం ట్రాక్టర్ బోల్తాపడిన ఘటనలో గాయపడిన బట్టుకండ్రిగకు చెందిన వెంకటేశ్‌రెడ్డి కుమార్తె బాలిక యశ్విని(17) ఆదివారం మృతి చెందింది. ఈ ఘటనలో డ్రైవర్‌తో సహా 8 మంది గాయపడిన విషయం తెలిసిందే. తీవ్రంగా గాయపడిన యశ్వినికి చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం వేలూరు సీఎంసీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అక్కడ మృతి చెందింది.తల్లిదండ్రుల ఫిర్యా దు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అనిల్‌కుమార్ తెలిపారు. కాగా బాలిక మృతితో బట్టుకండ్రిగ గ్రామంలో విషాదం నెలకొంది.